అశాంతి నుంచి ఆవిర్భవించిన జైనమతం

క్రీ.పూ. 6వ శతాబ్దంలో మతాల్లో వచ్చిన అశాంతి ఫలితంగా భారతదేశంలో జైన, బౌద్ధ మతాలు ఆవిర్భవించాయి. జైనమతం వైదిక మత మంత ప్రాచీనమైనది. జైన గురువులను తీర్థంకరులు అంటారు. తీర్థంకరులు అంటే మార్గదర్శకుడని అర్థం. మొత్తం తీర్థంకరులు 24 మంది. వీరిలో మొదటివాడు రుషభనాథుడు. 23వ తీర్థంకరుడు పార్శ్వనాథుడే చారిత్రక జైనమత స్థాపకుడంటారు. ఈయన తదనంతరం అస్తవ్యస్తమైన జైనమత సూత్రాలను సంస్కరించి ఈ మత ప్రగతి ప్రాబల్యానికి కారకుడైనవాడు వర్ధమాన మహావీరుడు.

వర్ధమాన మహావీరుడు : అసలు పేరు వర్ధమానుడు. ఈయన తండ్రి సిద్ధార్థుడు సామంత ప్రభువు. 'త్రిశాల' లిచ్ఛావి రాకుమార్తె ఇతని తల్లి. తల్లిది క్షత్రియ కులం, తండ్రి జ్ఞత్రిక వంశానికి చెందిన వాడు. క్రీ.పూ. 540లో కుంద గ్రామంలో జన్మించాడు. మహావీరుడి భార్య యశోధ, కుమార్తె అనోజ్ఞ. రాజభోగాలు, వైవాహిక జీవితం ఇతనికి మనశ్శాంతి నివ్వలేదు. మోక్ష మార్గాన్వేషణకు 30వ ఏట సన్యాసం స్వీకరించాడు. 12 సంవత్సరాల కఠోర తపస్సు చేసిన తర్వాత 42వ ఏట పరిపూర్ణ జ్ఞానం పొంది 'జిను'డయ్యాడు. ధైర్యసాహసాలతో తపస్సు సాగించడం వల్ల మహావీరుడన్నారు. జినుని బోధనలే జైనమైంది. దానిని అనుసరించినవారు జైనులయ్యారు. ఉత్తర భారతంలో వైశాలి, అంగ, చంప, రాజగృహ మొదలైన నగరాలను పర్యటించాడు. తన జ్ఞాన బోధను ప్రచారం చేసి, తన 72వ ఏట 'పావా' అనే నగరంలో హస్తి పాలుడనే రాజు గృహంలో (క్రీ.పూ. 468లో) మరణించాడు.

పంచవ్రతాలు : పార్శ్వనాథుడు బోధించిన నాలుగు సూత్రాలైన 'అసత్యమాడరాదు', 'జీవహింస చేయరాదు', 'ఆస్తిపాస్తులను కలిగి ఉండరాదు', 'దొంగతనం చేయరాదు' అనే వాటికి మహావీరుడు 5వ సూత్రంగా 'బ్రహ్మచర్యాన్ని' కలిపాడు. వీటిని పంచవ్రతాలు అంటారు.

త్రిరత్నాలు : సరైన ప్రవర్తన, సరైన విశ్వాసం, సరైన జ్ఞానం, అనే త్రిరత్నాలు ఆచరించడం ద్వారా మోక్షం పొందవచ్చని మహావీరుడు బోధించాడు. భగవంతుడు లేడు కానీ ఆత్మ ఉంది, ప్రకృతిలోని ప్రాణులకే కాక, చేతనాచేతన వస్తువులకు జీవముంటుంది. కాబట్టి అహింసను పరమ ధర్మంగా పాటించాలని అంటాడు మహావీరుడు.

సల్లేఖన వ్రతం : శరీరాన్ని ఉపవాసంతో శుష్కింపజేసి, ప్రాణత్యాగం చేయడం వల్ల మోక్షం లభిస్తుందని జైనుల విశ్వాసం. దీన్నే సల్లేఖన వ్రతం అంటారు.

జైనమత వ్యాప్తి: మగధ పాలకులైన బింభిసార, అజాత శత్రువు, మహా పద్మనందుడు, చంద్రగుప్త మౌర్యుడు, కళింగరాజు ఖారవేలుడు, చాళుక్యులు, రాష్ట్రకూటులు ఈ మతాన్ని ఆదరించారు.

దక్షిణ దేశంలో జైనమతం: శాతవాహనుల కాలంలో బౌద్ధమతంతో పాటు జైనమతం కూడా కొంత వృద్ధిచెందింది. కానీ బౌద్ధమతమంత ప్రాచుర్యం పొందలేదు. జైనుల సాహిత్యం శాతవాహనుల గురించి వివరిస్తుంది. ఆ రాజ్య స్థాపకుడైన శాతవాహనుడు, కొంతకాలం ప్రజాసంక్షేమ పాలన చేశాక ప్రజాకంటకుడై, దుర్మార్గుడైనట్లు, రాజ్యంలో తిరుగుబాట్లు చెలరేగినట్లు ఈ సాహిత్యం ద్వారా తెలుస్తుంది.

కొండ కుందాచార్యుడు: ఇతని అసలు పేరు పద్మనంది. అనంతరపురం జిల్లాలోని కొండకుందాపురంలో జన్మించడం వల్ల కొండ కుందాచార్యుడనే పేరు వచ్చింది. ఇతడు క్రీ.పూ. 41 నుంచి క్రీ.శ. 44 మధ్య జీవించాడు. ఈయన కేవలం ఆంధ్రదేశంలోనే కాకుండా, దక్షిణ భారతంలో జైనమత ప్రచారం చేశాడు. కొండ కుందాచార్యుడు జైన సంఘంలో 'బలత్కారణ, వక్రగచ్ఛ' అనే రెండు శాఖలను ప్రారంభించాడు. ఈ రెండు శాఖలు జైనమత విస్తరణకు పూనుకొన్నాయి. శ్రావణ బెళగొల వద్ద లభించిన శాసనం ప్రకారం ఈయన దేశమంతా పర్యటించి ఇతర మతాలపై జైనధర్మ ఆధిక్యతను నెలకొల్పాడు. కుందాచార్యుడు మతచర్చల్లో కొంత కర్కశత్వాన్ని అనుసరించినట్లు చరిత్ర చెబుతుంది. 'బాలక పించ, కొంద కిద్ధి, సామంత భద్ర' ఈయన శిష్యుల్లో ప్రముఖులు.

కొండ కుందాచార్యుడు 84 గ్రంథాలను 'పాహుడు' అనే ప్రాకృతంలో రచించినట్లు, వాటిలో 'సమయసార', 'పంచాస్థికాయ', 'ప్రవచనసార' వంటివి ముఖ్యమైనవని తెలుస్తుంది. శ్వేతంబర, దిగంబర శాఖల మధ్య విభేదాలు మరచి, అందరూ భక్తి విశ్వాసాలతో పఠించేటట్లు ఆయన గ్రంథ రచన చేశాడు.

సింహనంది: కొండ కుందాచార్యుని తదనంతరం ఆయన స్థాపించిన వక్రగచ్ఛకు ప్రధాన నాయకులైన వారిలో ప్రసిద్ధుడు సింహనంది. కడప జిల్లాలోని 'పేరూరు' కేంద్రంగా తెలుగు, కన్నడ ప్రాంతాల్లో జైనధర్మం ప్రచారం చేశాడు. గంగ వంశీయుల శాసనాలు, ఇతర సంప్రదాయ గాథల ప్రకారం, ఇతడు పశ్చిమ గంగ రాజ్యస్థాపనలో

దడిగ, మాధవ అనే సోదరులకు గురువై తోడ్పడినట్లు తెలుస్తుంది. వీరు శ్రీపర్వత (విజయపురి) ఇక్ష్వాక వంశంలోని వారని, ఇక్ష్వాక రాజ్యక్షయం తర్వాత సింహనందితో కలసి ప్రజాభిమానం పొందడానికి జైనమతం అవలంభించారని చరిత్ర చెబుతోంది.

దీన్నిబట్టి, క్రీ.పూ. 3వ శతాబ్దంలోనే దక్షిణ భారతంలో జైనధర్మం ప్రవేశించిందని తెలుస్తుంది. కొండ కుందాచార్యుల కృషి, క్రీ.శ. రెండో శతాబ్దిలో కళింగ ఖారవేలుని దండయాత్ర తరువాత ఆంధ్రదేశంలో జైనధర్మం పటిష్టమైంది. గుంటూరు జిల్లా వడ్డమాను వద్ద 'మహా మేఘవాహన విహారం' ఉన్నట్లు ఇటీవల లభించిన కొండవీడు తామ్ర శాసనాల ద్వారా బయటపడింది.

జైన స్థావరాలు: మనరాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో జైన స్థావర అవశేషాలు కనిపిస్తాయి. పిఠాపురం సమీపంలోని వేమంలో, అమలాపురం తాలుకా నేదునూరులో, పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలోనూ ఉన్న చెరువులు జైనులు తవ్వించినవే. భారతదేశంలో మహా విద్యాస్థానాలుగా జైనులు భావించే 14 కేంద్రాల్లో పెనుకొండ ఒకటి.

శీతలనాథుడు-భద్రాచలం: హతిగుంప శాసనం ప్రకారం-16వ తీర్థంకరుడు శీతలనాథుడు. కళింగ రాజ్యంలోని భాదలాపురంలో జన్మించా డని, అదే భాద్రపురమై, తర్వాత భద్రాచలంగా మారిందని చరిత్రకారుల అభిప్రాయం. నందరాజైన మహాపద్మనందుడు కళింగపై దాడి చేసి అక్కడి శీతల నాథుడి విగ్రహాన్ని మగధకు తీసుకుపోయాడు. తర్వాత కాలంలో కళింగ ఖారవేలుడు మగధపై దండెత్తి, శుంగ రాజును ఓడించి, దానిని తిరిగి తెచ్చాడని హతిగుంప శాసనం. కోటిలింగాలకు దగ్గరలోని స్తంభంపల్లిలో జైన 'మానస్తంభం' ఉంది. అక్కడి నుంచి 2కి.మీ. దూరంలో మూనులగుట్ట మీద జైన కట్టడాలు దర్శనమిస్తాయి. జైనపేట, జనగామ, మానకొండూరు, జైనాల, జన్నారం మొదలైన గ్రామాలపేర్లు, మొదటి శాతవాహన రాజులు జైన మతాన్ని అనుసరించారనే వాదాన్ని బలపరుస్తాయి.

సంప్రతి విహారం : మౌర్య అశోకుడి పుత్రుడు సంప్రతి కూడా ఆంధ్ర, ద్రావిడ దేశాల్లో జైనవ్యాప్తికి కృషి చేశాడనడానికి అమరావతి దగ్గరి వడ్డమాను కొండపై ఏర్పడిన 'సంప్రతి విహారమే' నిదర్శనం.

ప్రాక్టీస్ ప్రశ్నలు

1.చారిత్రక జైనమత స్థాపకుడు పార్శ్వనాథుడు ఈ ప్రాంతానికి చెందినవాడు?

ఎ) బెనారస్ బి) పాటలీపుత్రం
సి) రాజగృహం డి) వైశాలి

2.వర్ధమాన మహావీరుడు ఈ రాజు సమకాలికుడు?

ఎ) మహా పద్మనందుడు బి) బింబిసారుడు
సి) బిందుసారుడు డి) కాలాశోకుడు

3. పంచవ్రతాల్లో చేర్చిన 5వ సూత్రం?

ఎ) అసత్యమాడరాదు బి) ఆస్తులు కలిగి ఉండరాదు
సి) బ్రహ్మచర్యం పాటించాలి డి) జీవహింస చేయరాదు

4.సల్లేఖనమనగా?

ఎ) పంచవ్రతాలను సరిగ్గా ఆచరించడం
బి) త్రిరత్నాలపై నమ్మకం
సి) తీర్థంకరులపై అచంచల విశ్వాసం
డి) ఉపవాసం ద్వారా ప్రాణత్యాగం చేయడం

5.శ్రావణ బెళగొలలో ప్రాణత్యాగం చేసిన రాజు?

ఎ) చంద్రగుప్త మౌర్యుడు బి) బిందుసారుడు
సి) అజాత శత్రువు డి) భాద్రభహుడు

6.ప్రజల తిరుగుబాటులో హతుడైన శాతవాహన రాజు?

ఎ) కుంతల శాతకర్ణి బి) శాతవాహనుడు
సి) శివశ్రీ శాతకర్ణి డి) పులోమావి

7.ఆంధ్రదేశం, దక్షిణ భారతంలో జైనమతం ప్రచారం చేసినవాడు?

ఎ) సింహనంది బి)కొండ కుందాచార్యుడు
సి) సామంత భద్ర డి) బాలక పింఛ

8.కొండ కుందాచార్యుడు జైనమతంలో ఈ శాఖలను ప్రారంభించాడు?

ఎ) శ్వేతంబర, దిగంబర బి)బలత్కారణ, వక్రగచ్ఛ
సి) మహాయన, హీనయాన
డి) హీనయానా, వజ్రయానా

9.కుందనాచార్యుడు రచించిన గ్రంథాలు?

ఎ) సమయ సార బి) పంచాస్థికాయ
సి) ప్రవచన సార డి) ఎ, బి, సి

10.ఆంధ్రదేశంలోని ప్రముఖ జైనక్షేత్రం ఏది?

ఎ) భువనగిరి బి) జనగాం
సి) అమరావతి డి) కొలనుపాక

జవాబులు	1	2	3	4	5	6	7	8	9	10
	A	B	C	D	A	B	B	B	D	D